


# కరపత్రం

SINCE 2014

మంగళవారం మే 26, 2026 | సంపుటి : 2 | సంచిక : 224 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## మద్దతు ధరలు పెంచి కేంద్రం చేతులు దులుపుకుంటోంది

### కనీసం 30శాతం కూడా ధాన్యం సేకరించడం లేదు

» తెలంగాణలో విద్యారంగం పటిష్టతకు కఠిన చర్యలు
» లెఫ్ట్ నేతలతో భేటీలో సిఎం రేవంత్ వివరణ
» కార్మికుల కనీస వేతనం పెంచడంపై లెఫ్ట్ నేతల అభినందన

**హైదరాబాద్,మే25 :**
కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచడమే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. కనీసం 30 శాతం ధాన్యం కూడా సేకరించడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సీపీఎం, సీపీఐ బృందాలు వేర్వేరుగా సీఎంతో సమావేశమయ్యాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆయా పార్టీ నేతలు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవడంపై నేతలు సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, మూసీ ప్రక్షాళన, విద్యారంగ అంశాలపైనా వారి మధ్య చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు వారి స్వస్థలాలకు వెళ్లడంతో ఇక్కడ కొరత ఏర్పడిందన్నారు. మరోవైపు ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి.. మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని, అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను వివరించారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చెప్పారు. విద్యా రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వారికి వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ.. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నేతలను రేవంత్ కోరారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని.. దానిలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నామని తెలిపారు.





## కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

- ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్ గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మే25 :**
తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు.తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.

మిగతాద్ది 2 లో

## లారీల సమస్యతో ధాన్యం తరలింపులో ఆలస్యం

» తడిసిన ధాన్యం సైతం ప్రభుత్వం కొంటుంది
» ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడి

2 లో

**హైదరాబాద్,మే25 :**
రాష్ట్రంలో పండిన ధాన్యమంతా ప్రభుత్వం తప్పక కొనుగోలు చేస్తుందని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. లారీల కొరత వల్ల ధాన్యం తరలింపు ఆలస్యం అవుతోందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.





## దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

- ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అబద్దాలు
- ఎన్సాన్‌పల్లి ఐకెపి సెంటర్ సందర్శించిన హరీష్ రావు

**సిద్దిపేట,మే25 :**
ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు అరిగోస పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. యూరియా, సాగునీరు, కరెంట్ సరఫరా, పండిన పంట కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయ్యిందన్నారు. రైతులు ఇంత బాధపడటం మొట్టమొదటి సారి చూస్తున్నామన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్లో వరి ధాన్యాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రభుత్వం ఉన్నా ఇట్లాంటి దుర్భర పరిస్థితులు ఎదురు కాలేదని చెప్పుకొచ్చారు.

మిగతాద్ది 2 లో



2లో

## బతికుంటే సహాయం సున్నా

» చస్తే దక్కని కనీస మర్యాద
» వ్యక్తి మృతదేహాన్ని మోసుకెళ్లిన ఘటన దారుణం
» ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,మే25 :**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో పరిస్థితి చాలా దారుణంగా దిగజారిపోయిందని ఆరోపించారు. ఒక మృతదేహాన్ని కుటుంబ సభ్యులే భుజాలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల

## ధాన్యం కొనుగోలు

» మిగతా ధాన్యం కూడా కొనడానికి ప్రభుత్వం సిద్దం
» కేంద్రం తీరుతోనే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు
» బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల



మిగతాది 2లో

**ఖమ్మం,మే25 :**
దేశంలో అన్నిరకాల పంటలను తమ ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వరిధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు సిగ్గులేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కనీసం గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్దితి ఉందని అన్నారు. కేందప్రభుత్వ దుర్మార్గమైన విధానాల కారణంగానే రైతాంగం కష్టాల్లో ఉన్నారని తెలిపారు. కనీసం డీజిల్ ఇవ్వకపోవటంతో ఎక్కడికక్కడా ధాన్యం రవాణా ఆగిపోయిందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ధ్వజమెత్తారు. అటు సాగర్ ఆయకట్టు.. ఇటు సీతారామ ఆయకట్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కృష్ణా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పలు సంస్థలను నిర్వీర్యం చేశారని ఫైర్ అయ్యారు.



2లో..

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థక ఊరట

**రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి ఒప్పందం**

**హైదరాబాద్,మే25 :**
హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ఊరట చేకూరింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆర్‌ఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో కీలక రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై సోమవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సమక్షంలో ఈ ఒప్పంద ప్రక్రియ పూర్తయింది.

## పెట్రో ధరల పెంపు ఎవరి కోసం

- ఎవిర లాభంకోసం ధరలు పెంచుతున్నారు
- కేంద్రం తీరుపై మండిపడ్డ మల్లికార్జన ఖర్గే



02

**న్యూఢిల్లీ,మే25 :**
శంలో రోజురోజుకు పెరుగుతోన్న ఇంధన ధరల పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రోజూవారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు.

# బతికుంటే సహాయం సున్నా

మొదటిపేజీ తరువాయి

బతికి ఉన్నప్పుడు సహాయం లేకపోయినా, మరణానంతరం కనీస గౌరవం కూడా దక్కని పరిస్థితికి తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకెళ్లిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఓ పోస్టు పెట్టారు. పేదల అంతిమయాత్ర కూడా గౌరవప్రదంగా సాగాలని కేసీఆర్ హయాంలో భావించి, మృతదేహాల తరలింపునకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశాయమని కేటీఆర్ గుర్తుచేశారు. అదే మానవత్వం, అదే ప్రజల గౌరవాన్ని కాపాడే పాలన అని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసోందని.. ప్రజలకు అవసరమైన కనీస వసతులను అందించడంలో ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. పోస్టర్లు, సభలు, పర్యటనలు, హెలికాప్టర్ల కోసం ప్రజల డబ్బును ఖర్చు చేస్తున్నారని, కానీ పేదలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆగ్రహించారు. రాజకీయ కక్షసాధింపులు, విమర్శలు, ప్రచార హోరులోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిమగ్నమైందని విమర్శించారు. ప్రజల కష్టాలు, సమస్యలు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో పాలన సాగిందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన మార్పు ఇదేనా..? అని ప్రశ్నించారు. తెలంగాణ గౌరవాన్ని వీధుల్లోకి లాగడానికే ప్రజలు ఈ ప్రభుత్వానికి అధికారం ఇచ్చారా..? అని నిలదీశారు. నాయకుల పాదయాత్రలకు విలాసవంతమైన బస్సులు, ప్రచారాలకు ప్రభుత్వ వనరులు ఉపయోగించే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, పేదల అంతిమయాత్రకు కనీస గౌరవం ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటన కేవలం ఒక కుటుంబం విషాదం మాత్రమే కాదని, తెలంగాణ సమాజాన్ని కుదిపేస్తున్న పరిస్థితికి నిదర్శనమని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఓ కుటుంబం తమ బంధువు మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కండె వెంకన్న (42) వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు వెంకన్న అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తర్వాత మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేటు వాహనం ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆస్పత్రి అధికారులు మార్చురీ వ్యాన్ ఏర్పాటు చేయాలని పలుమార్లు వేడుకున్నారు. రెండు గంటల పాటు ఎదురుచూసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చివరకు చేసేదేమీ లేక కండె వెంకన్న మృతదేహాన్ని బంధువులే భుజాలపై మోసుకుంటూ ఇంటికి తీసుకెళ్లారు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సదుపాయాలు లేక ప్రజలు ఇలాంటి ఇబ్బందులు పడటం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని.. ఇంకా కొంటామని స్పష్టం చేశారు. సోమవారం యాతాలకుంట టన్నెల్‌ను మంత్రి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్ వద్ద అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందాలనేది తన చిరకాల వాంఛ అని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం ఎక్కువ అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు గోదావరి ఆయకట్టు దక్కలేదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చివరి ప్రాంతమైన ఖమ్మానికి గోదావరి జలాలు అందలేదని ప్రస్తావించారు. ఎక్కువ భూభాగం ఎన్నెస్పీ కెనాల్ పైభాగం.. కింద భాగంలో గోదావరి ఉండటంతో నీరు అందలేదని అన్నారు. తాను తెలుగుదేశం పార్టీలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసి.. అప్పటి ముఖ్యమంత్రిని.. ఖమ్మానికి గోదావరి జలాలు అందించాలని కోరానని ప్రస్తావించారు. నల్గొండ ఎ÷-లోరైడ్ పీడిత ప్రాంతానికి మాజీ సీఎం ఎన్టీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవకాశం ఇచ్చారని తెలిపారు. గోదావరిపై మొట్టమొదట దేవాదుల ప్రారంభించామని చెప్పుకొచ్చారు. గోదావరిపై ఎత్తిపోతల పథకాలకు తప్ప మరో అవకాశం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. గోదావరిపై 1998లో దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చామని వివరించారు. ఆనాడు దుమ్ముగూడెం వద్ద రాజీవ్ సాగర్ - ఇందిరా సాగర్ వరకు ప్రారంభించిన పంపులు మోటార్లకే పరిమితమయ్యాయని అన్నారు. దుమ్ముగూడెం శ్రీరామచంద్రుడు నడయాడిన ప్రాంతంలో సీతారామ ప్రారంభించామని చెప్పుకొచ్చారు. ఆ ప్రభుత్వంలో కేవలం పంప్‌హౌస్ నిర్మాణ పనులకే పరిమితమయ్యాయని అన్నారు. యాతాలకుంట టన్నెల్ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు నీరు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఈ టన్నెల్ పూర్తి చేయడానికి కూడా నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల అన్నారు. ఇది తన జీవిత ఆశయమని.. లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పానని ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి మొదటిసారి రాజీవ్ లింక్ కెనాల్‌కు అనుమతి ఇచ్చారని అన్నారు. ఆరునెలల్లో రాజీవ్ లింక్ కెనాల్ పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాతాలకుంట టన్నెల్‌కు అనుమతి ఇచ్చారని వెల్లడించారు. 15 నెలల్లో రెండు కిలోమీటర్ల పొడవు టన్నెల్ నిర్మాణం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు చేపట్టిన ఏజెన్సీ, అధికారులను మంత్రి తుమ్మల అభినందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని.. ఇది తన రాజకీయ కోరిక అని వ్యాఖ్యానించారు. తనను ఆశీర్వదించిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నదే తన ఆశయమని ఉద్ఘాటించారు. ఆగస్టు 15వ తేదీలోగా లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. 35 సంవత్సరాల క్రితమే డొక్కా సీతమ్మ ఆక్విడెక్ట్ కట్టామని ప్రస్తావించారు. రైతుల త్యాగానికి ఫలితంగా నష్టపరిహారం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించానని తెలిపారు.

# పలు ప్రాంతాల్లో ఈదురుగాలుల వర్షం
# రోహిణి ప్రవేశంతో మండుటెండలు మరింత తీవ్రం

**- పలు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు**

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. హైదరాబాద్‌లోని వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ఘట్‌కేసర్‌లో వడగళ్ల వర్షం కురిసింది. మెదక్, సూర్యాపేట జిల్లాల్లోనూ వర్షం కురిసింది. దీంతో ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. మెదక్ పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. గంగినేని థియేటర్ వద్ద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మెదక్ మార్కెట్ యార్డులో ధాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ర్యాలమడుగులో ఈదురుగాలుల తీవ్రతకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయింది. మంభోజిపల్లిలో 3 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సూర్యాపేట జిల్లా పాలకవీడులో ఈదురుగాలులు ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇకపోతే రోహిణి కార్తె సోమవారం నుంచే ప్రారంభం అయ్యింది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. రోహిణీ కార్తె ప్రవేశించిన వేళ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. తెలంగాణ ప్రణాళికా సంఘం మే 25న విడుదల చేసిన గరిష్ట ఉష్ణోగ్రతల వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఎండ తీవ్రత 45 డిగ్రీల నుండి ఏకంగా 46.5 డిగ్రీల సెల్సియస్‌కు చేరడంతో జనం ఇళ్ల నుండి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే మొదలవుతున్న ఎండ తీవ్రత, మధ్యాహ్నానికి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రాష్ట్రంలోనే అత్యధికంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. దీనితో పాటు సూర్యాపేట, మంచిర్యాల జిల్లాల్లో 46.4 డిగ్రీలు, నల్గొండ, ఖమ్మం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 46.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లో 46.2 డిగ్రీలు, జగిత్యాలలో 46.1 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, మహబూబాబాద్ జిల్లాల్లో 45.9 డిగ్రీలుగా ఎండ తీవ్రత నమోదైంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, జనగామ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటేసి రెడ్ అలర్ట్ పరిధిలోకి వచ్చేశాయి.

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విషయానికి వస్తే.. నగరంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, చుట్టుపక్కల ఉండే మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 42.4, రంగారెడ్డిలో 43.1, సంగారెడ్డిలో 42.1 డిగ్రీల చొప్పున ఎండలు ఉన్నాయి. కేవలం నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మాత్రమే నిన్నటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే తక్కువగా నమోదై కాస్త ఉపశమనం కలిగించాయి. అయితే, రాబోయే మూడు రోజుల వాతావరణ ముందస్తు సూచనలు కూడా ఏమాత్రం ఆశాజనకంగా లేవు. రానున్న రోజుల్లో ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం లాంటి జిల్లాల్లో ఎండలు మరింత ముదిరి 45.7 డిగ్రీల వరకు వెళ్లే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యం గా మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు తగ్గించుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

## కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

మొదటిపేజీ తరువాయి

మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతిని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసి, ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ రెచ్చగొట్టినా వెనక్కి తగ్గలేదన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని సీఎం వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనార్థాలు పెడుతుందో అందరం చూస్తున్నామన్నారు.

## డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు
## ఫల్తా గెలుపుతో టిఎంసికి బీటలు

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఊహించని భారీ కుదుపు చోటుచేసుకుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫల్తా' అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉత్కంఠభరిత రీపోలింగ్‌లో భారతీయ జనతా పార్టీ అఖండ విజయాన్ని నమోదు చేసింది. ఈ రీపోలింగ్‌లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా ఏకంగా 1,08,000 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచి సంచలనం సృష్టించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ తగిలి ఏకంగా నాలుగో స్థానానికి పడిపోయింది. ఇక్కడి అభ్యర్థి పోలింగ్‌కు ముందే చేతులెత్తేశారు. విజయం సాధారణమైనది కాదు.. ఎందుకంటే ఫల్తా నియోజకవర్గం టీఎంసీ నెంబర్-2, ఎంపీ అభిషేక్ బెనర్జీకి చెందిన 'డైమండ్ హార్బర్' లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. ఒకప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌కు తిరుగులేని కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో కమలం వికసించడం.. బెంగాల్ రాజకీయాల్లో ఇక మమతా బెనర్జీ మార్క్ హవాకు బ్రేకులు పడ్డాయనే సంకేతాన్ని స్పష్టంగా ఇస్తోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. స్థానానికి తొలిసారిగా ఏప్రిల్ 29న పోలింగ్ జరిగింది. అయితే ఆ సమయంలో అధికార టీఎంసీ ఈవీఎంల తారుమారుకు పాల్పడిందని, బూత్ క్యాప్చరింగ్, ఓటర్లను బెదిరించడం వంటి అక్రమాలకు ఒడిగట్టిందని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ స్థానంలో నెలకొన్న తీవ్రతను గమనించిన ఎన్నికల సంఘం (ఇఅ) అక్కడ జరిగిన పోలింగ్‌ను రద్దు చేసి, మే 21న కట్టుదిట్టమైన కేంద్ర బలగాల నిఘాలో మొత్తం 285 బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించింది. ఈసారి భయం లేకుండా దాదాపు 88 శాతం మంది ఓటర్లు తరలివచ్చి ప్రశాంతంగా ఓటు వేశారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచే బీజేపీ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. రౌండ్ రౌండ్‌కు మెజారిటీ పెరుగుతూ పోయింది..ఈ రీపోలింగ్‌కు ముందే ఓటమిని పసిగట్టిన టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ తాను పోటీలో నిలబడనని ముఖం చాటేయడం గమనార్హం. అయితే చివరకు ఆయనకు ఈ ఎన్నికల్లో దక్కింది కేవలం 7 వేల పైచిలుకు ఓట్లే. ఈ ఘోర పరాజయాన్ని జీర్ణించుకోలేకపోతున్న మాజీ సీఎం మమతా బెనర్జీ రిజల్ట్స్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ ఏజెంట్లలా నటిస్తూ కేంద్ర బలగాలు కౌంటింగ్ కేంద్రాల్లోకి దూరి ఓట్లను మళ్లీ దొంగిలించాయని అంటూ ఆమె మండిపడ్డారు. మరోవైపు ఈ ఘనవిజయంపై పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి స్పందిస్తూ.. టీఎంసీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

## దుర్భర పరిస్థితుల్లో
# తెలంగాణ రైతులు

మొదటిపేజీ తరువాయి

'ఉత్తమ్ నీది నోరా మోరా.. మొన్న 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అని చెప్పి ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అనడం ఎంతవరకు సబబు' అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం కాదని.. కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కోటి మెట్రిక్ టన్నుల ధాన్యంలో 70 లక్షలు కొంటే మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని మాజీ మంత్రి ప్రశ్నించారు. తాలు పెడితే తోలు తీస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. సిద్దిపేట నియోజకవర్గంలో క్వింటాల్‌కు 5 కిలోలు తరుగు తీస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని విమర్శించారు. రోహిణి కార్తె వచ్చినా కళ్లాల్లోనే ధాన్యం, రైతులు ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నదని తెలిపారు. రైతులు గుండెలు బాదుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కళ్లు కనబడటం లేదంటూ విమర్శలు గుప్పించారు. వరి కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ÷-ూష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు వదిలారని హరీశ్ రావు తెలిపారు. 'మిషన్ మోడ్‌లో వడ్లు కొనాలని రేవంత్ అంటున్నారు. నీది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్. నిన్న కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులకు ఆదేశాలు ఇస్తారని రైతులు ఆశించారు. రైతుల ఆశలు నిరాశ అయ్యాయి. 45 రోజుల్లో మొత్తం రైతుబంధు వేస్తానని చెప్పి 60 రోజులు గడిచినా వేయలేదు. రేవంత్ రెడ్డి కేవలం పేపర్ టైగర్ మాత్రమే... దేవుని మీద ఒట్టు పెట్టి మాట తప్పిన రకం నువ్వు. ఢిల్లీ ట్రిప్పులు మాని.. లారీల ట్రిప్పులు పెంచు. ఒకటి, రెండు రోజుల్లో మార్పు రాకుండే స్వయంగా నేనే కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నా చేపడతా. వేలాది మంది రైతులతో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌లను దిగ్బంధిస్తాం. రాజకీయ విమర్శలు మాని పరిష్కార మార్గాలు చూడండి' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## లారీల సమస్యతో ధాన్యం తరలింపులో ఆలస్యం

మొదటిపేజీ తరువాయి

'లారీల కొరత సమస్యను అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇసుక లారీలు, ట్రాక్టర్లను కూడా ధాన్యం తరలింపు కోసం వాడుతున్నాం. ఈలోపు వర్షం పడి ధాన్యం తడిసినా.. ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ధాన్యం తడిసి రంగు మారినా.. కొనుగోలు చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్, భాజపా నాటకాలు ఆడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల టన్నులనే కొనుగోలు చేస్తామని చెప్పింది. ధాన్యం కొనుగోళ్ల గురించి మాట్లాడే హక్కు భాజపా నేతలకు లేదు. రాష్ట్రంలో కోటి టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చింది. కేంద్రం మాత్రం 52 లక్షల టన్నులకు మాత్రమే మద్దతు ధర చెల్లిస్తామని చెప్పింది. రాష్ట్రంలో మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని భాజపా నేతలు కేంద్రానికి చెప్పాలి. కేంద్రం కొనకపోయినా.. మొత్తం ధాన్యాన్ని రాష్ట్రం కొనుగోలు చేస్తోంది. కేంద్రం మద్దతు ధర ఇవ్వకపోయినా మరో 70 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తోంది. రైతులను అడ్డం పెట్టుకొని భాజపా, బీఆర్ఎస్ కలిసి డ్రామాలు చేస్తోంది' అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.

## పెట్రో ధరల పెంపు ఎవరి కోసం

మొదటిపేజీ తరువాయి

2014లో రూ.71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను మోదీ సర్కారు 2026 నాటికి రూ.102.12కు చేర్చిందని ఎద్దేవా చేశారు. రెండు వారాల లోపే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఇది నాలుగోసారి అని.. ఈ రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదన్నారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు వరుసగా 5.8, 4.44, 3.90 శాతం పెరిగాయన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం భాజపా నైజమన్నారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం భాజపా దోపిడీ భారాన్ని మోస్తోందన్నారు. దేశవ్యాప్తంగా నేడు మరోసారి భారీగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెంచాయి. పెంచిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. కాగా ఇప్పటికే మూడు విడతలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. దీంతో దిల్లీలో పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది.

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థక ఊరట

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చే కీలక అడుగుగా ఈ ఒప్పందాన్ని అధికారులు అభివర్ణించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పట్టణ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎస్ రామకృష్ణ రావు తెలిపారు. హైదరాబాద్ దేశ ఆర్థిక వృద్ధికి కీలక కేంద్రంగా ఎదుగుతోందని, మెట్రో కనెక్టివిటీ విస్తరణతో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న రుణాలను ర్గీ÷నాన్స్ చేసేందుకు రూ.13,600 కోట్ల రుణం మంజూరు చేయనున్నారు. నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ ర్గీ÷నాన్సింగ్ కోసం ఈ నిధులను వినియోగించనున్నారు. 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో ఈ రుణ సదుపాయం ఇవ్వనున్నారు. ర్గీ÷నాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రోపై ఉన్న ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలకు కూడా ఆర్థిక వెసులుబాటు కలగనుంది. మరో కీలక పరిణామంగా, లార్సెన్ అండ్ టూబ్రో నుంచి ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ వందశాతం యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కానుంది. దీంతో హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రధాన ప్రజా రవాణా ఆస్తిగా మారనుంది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు బృందాలకు సీఎస్ రామకృష్ణరావు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌కు సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎస్ స్పష్టం చేశారు.

## తాజ్‌మహల్ సందర్శించిన మార్కో రుబియో
# గంటన్నరపాటు అక్కడ గడిపిన రుబియో జంట

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తాజ్‌మహల్ అందానికి ఫిదా అయ్యారు. భారత్ పర్యటనలో భాగంగా ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను కొద్ది సేపటి క్రితం సందర్శించారు. ఆయనతో పాటు భార్య జెనెట్ రుబియో, భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్ కూడా తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఈ నేపథ్యంలో తాజ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు

తాజ్ మహల్ వద్ద దాదాపు గంటన్నర పాటు గడిపిన రుబియో దంపతులు సందర్శకుల పుస్తకంలో ప్రత్యేక సందేశం రాశారు. 'ప్రపంచంలోనే గొప్ప సంపదను సందర్శించేందుకు మాకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు' అంటూ రుబియో దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. మార్కో రుబియో నాలుగు రోజుల పాటు భారత్‌లో పర్యటించేందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయన కోల్‌కతా, న్యూఢిల్లీ పర్యటనలు పూర్తి చేసి, ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో కీలక చర్చలు జరిపారు . మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం భారత పర్యటనను పూర్తి చేసుకుని అమెరికాకు పయనమవుతారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
మంగళవారం మే 26, 2026

# కంటైనర్‌ను ఢీకొన్న డీసీఎం

– షామీర్ పేట్ వద్ద ఓ.ఆర్.ఆర్ పై ప్రమాదం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కీసర నుంచి మేడ్చల్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శామీర్‌పేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో సిలిండర్ బ్లాస్ట్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
హైదరాబాద్‌లోని కాప్రా చౌరస్తాలో సోమవారం ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై వెళ్తున్న ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ధ్వంసమైంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# న్యాయవాది హత్యపై నిరసన

- న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరుట్ల బార్ అసోసియేషన్ డిమాండ్

**కరపత్రం ప్రతినిధి కోరుట్ల**



హైకోర్టు సీనియర్ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ ను హైదరాబాద్ లో దుండగులు కారుతో ఢీకొట్టి హత్య చేయడాన్ని నిరసిస్తూ, సోమవారం కోరుట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఆయన మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు

# మెట్టుపల్లి మునిసిపల్ లో అవినీతి

- టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతిపై బీజేపీ ధర్నా



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
మెట్పల్లి మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ బీజేపీ సోమవారం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా బీజేపీ మెట్పల్లి పట్టణ శాఖ అధ్యక్షులు ధోనీకేల నవీన్ మాట్లాడుతూ అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని, 2023–24లో జరిగిన క్రీడా మైదానాల అవినీతిపై విజిలెన్స్ విచారణ జరపాలని, హరితహారం పేరుతో జరిగిన కుంభకోణాన్ని పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల అనుమతుల్లోనూ అవినీతి జరిగిందని ఆరోపించారు.

# బిజెపి ఎస్. టి మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా గుగులోతు శ్రీకాంత్ నాయక్...

భారతీయ జనతా పార్టీ ఎస్ టి మోర్చా రాష్ట్ర కార్యదర్శి గా గుగులోతు శ్రీకాంత్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర కార్యాలయం నియామకపు ఉత్తర్వుల ప్రకటన విడుదల చేసింది. ఈసందర్భంగా శ్రీకాంత్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బిజెపి ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా తిరిగి రెండోసారి బాధ్యతలు అప్పగించడానికి సహకరించిన కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ , కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగా డి కృష్ణారెడ్డి, రాష్ట్ర , జిల్లా కమిటీ నాయకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

# ఇల్లందకుంట పాఠశాలలో ఘనంగా సమ్మర్ క్యాంప్ ముగింపు ఉత్సవాలు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 25**
తేదీ: 25.05.2026 సోమవారం రోజున ఇల్లందకుంట మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇల్లంతకుంటలో సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సమ్మర్ క్యాంప్ తేదీ: 11.05.2026 నుండి 25.05.2026 వరకు 15 రోజులు లాంగ్వేజ్ స్కిల్స్, కూచిపూడి నృత్యం, ఆర్ట్ అండ్ డ్రాయింగ్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కార్యక్రమాల మీద మండలంలోని ఆరవ తరగతి నుండి 9వ తరగతి వరకు గల విద్యార్థులందరికీ నేర్పించడం జరిగినది. సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా విద్యార్థులందరికీ పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానం చేయడం జరిగినది.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు తస్లీమ్ నస్మీన్ మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంప్ విద్యార్థుల యొక్క మానసిక, శారీరక ఉల్లాసానికి మరియు విద్యార్థుల యొక్క సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఉపయోగపడుతుందని ఇల్లంతకుంట పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు స్వేచ్ఛాయుత వాతావరణంలో కూచిపూడి నృత్యం, కర్సివ్ హ్యాండ్ రైటింగ్, ఇండోర్ గేమ్స్ అయినటువంటి చెస్, క్యారం, షటిల్ బ్యాడ్మింటన్, ఆర్ట్ అండ్ డ్రాయింగ్ పెయింటింగ్ కార్యక్రమాలపై నలుగురు



టీచింగ్ ఇన్స్ట్రక్టర్లను నియమించి విద్యార్థులకు ఈ యొక్క సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరిగిందని విద్యార్థులందరూ చాలా చురుగ్గా పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచారని అలాగే మన పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇల్లందకుంట పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యాబోధన చేయుచున్నారని పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించామని మన పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ఫైనల్ పై విద్యాబోధన చేయుచున్నామని చక్కటి గ్రంథాలయము సైన్స్ ల్యాబ్, రుచికరమైనటువంటి మధ్యాహ్న భోజనము, ఉచిత పాఠ్య పుస్తకములు, నోట్ బుక్స్ మరియు ఈ విద్యా సంవత్సరం నుండి ప్రతి విద్యార్థికి 21 వస్తువులు కలిగిన కిట్టు బ్యాగు ఉచితంగా ప్రభుత్వం ద్వారా అందిస్తున్నామని తెలిపారు.

ఈ యొక్క సమ్మర్ క్యాంపు కు ముఖ్యఅతిథిగా



విచ్చేసిన ఇల్లందకుంట మండల విద్యాధికారి కే. రాములు మాట్లాడుతూ మన పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 రోజులుగా ఈ యొక్క సమ్మర్ క్యాంప్ని నిర్వహించడం జరిగిందని, పాఠశాలలో నిర్వహించిన కూచిపూడి నృత్యము, హ్యాండ్ రైటింగ్, ఇండోర్ గేమ్స్, చిత్రలేఖనము వంటి కార్యక్రమాలను ప్రత్యేక శిక్షణ పొందిన ఇన్స్ట్రక్టర్ల ద్వారా నేర్పించడం జరిగిందని ఇది ఇల్లందకుంట మండలంలోని అన్ని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అందరూ పాల్గొన్నారు అని తెలిపారు.

ఇట్టి కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తస్మిన్ నజీలీమ్ మండల విద్యాధికారి కె రాములు ఉపాధ్యాయులు కే జయప్రకాష్ సిహెచ్ వేణు కే శంకర్ మరియు సమ్మర్ క్యాంప్ ఇన్స్ట్రక్టర్లు శ్రీమన్నారాయణ, సహశ్రీ, ధ్రువంశ్, రాజేందర్ మరియు సమ్మర్ క్యాంపు లో పాల్గొన్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గాలి దుమారానికి అంకుషాపూర్‌లో ఇళ్ల ధ్వంసం -- బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 25**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం అంకుషాపూర్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం సుమారు 3:30 గంటల సమయంలో వీచిన భారీ గాలి దుమారం కారణంగా పలు ఇండ్లు నేలమట్టమయ్యాయి. ఈ ఘటనతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడం, గోడలు కూలిపోవడం వల్ల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అకస్మాత్తుగా సంభవించిన ఈ ప్రకృతి విపత్తుతో బాధితులు తమ నివాసాలను కోల్పోయి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఈ ఘటనపై తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము స్పందిస్తూ ప్రభుత్వం



తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జమ్మికుంట తహసిల్దార్, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కూలిపోయిన ఇండ్లను పరిశీలించి నష్టపోయిన కుటుంబాలకు అత్యవసర సహాయం అందించాలని కోరారు.



ప్రభుత్వ అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి నష్టాన్ని అంచనా వేసి బాధితులకు ఆర్థిక సహాయం, తాత్కాలిక నివాస ఏర్పాట్లు, అవసరమైన నిత్యావసర వస్తువులు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.
అలాగే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు బాధిత కుటుంబాలకు వేగంగా సహాయం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించి బాధిత కుటుంబాలకు తక్షణ ఉపశమనం కల్పించాలని తెలంగాణ రైతు సంఘం తరఫున డిమాండ్ చేశారు.

# రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు -- 50% సబ్సిడీతో వినియోగించుకోవాలని పిలుపు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, మే 25:**
ఇల్లందకుంట మండల పరిధిలోని రైతులు ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలను వినియోగించుకోవాలని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు కోరారు. పచ్చిరొట్ట పంటగా ఉపయోగించే జీలుగ విత్తనాలు భూసారాన్ని పెంచడంలో, పంట దిగుబడులను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.
జీలుగ విత్తనాల పూర్తి ధర రూ.4,905 కాగా, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందించడంతో రైతులకు



రూ.2,452.50కే అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఒక బస్తాలో 30 కిలోల విత్తనాలు ఉండగా, అది సుమారు రెండున్నర ఎకరాల సాగుకు సరిపోతుందని వివరించారు. వరిపొలాల్లో నాట్లు వేసే ముందు జీలుగ విత్తనాలను చల్లి, అవి పెరిగిన అనంతరం భూమిలో కలియదున్ని నాటు వేస్తే పచ్చిరొట్ట ఎరువులా పనిచేసి భూసారాన్ని పెంచడంతో పాటు అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.
రైతుల అవసరాల దృష్ట్యా మండలంలోని పలు కేంద్రాల్లో జీలుగ విత్తనాలను నిల్వ ఉంచారు. డీసీఎంఎస్ కాంప్లెక్స్, లక్ష్మన్నపల్లి -- 200 బస్తాలు, రాచపల్లి -- 200 బస్తాలు, మల్యాల -- 133 బస్తాలు, సిరిసేడు -- 200 బస్తాలు కలిపి దాదాపు 930 బస్తాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.
జీలుగ విత్తనాలను కొనుగోలు చేయదలచిన రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతితో సంబంధిత కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. రైతులకు జీలుగ విత్తనాల సరఫరా విషయంలో వ్యవసాయ అధికారులు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయానికి సంబంధించిన అవసరాలు, సందేహాలు లేదా సలహాల కోసం రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంటల ఉత్పాదకతను పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

# ఇందిరా మహిళ శక్తి కింద మహిళలకు చీరల పంపిణీ ప్రారంభం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 25**
జమ్మికుంట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం జమ్మికుంటలో ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలకు చీరలు అందజేశారు.
ఈ సందర్భంగా కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారితో పాటు సంఘాల్లో సభ్యత్వం లేని మహిళలకు కూడా చీరల పంపిణీ చేపట్టడం జరుగుతుందని వివరించారు.
ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మహిళల సాధికారత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన



పేర్కొన్నారు. ఈ చీరల పంపిణీ కార్యక్రమం వరుసగా మూడు రోజుల పాటు కొనసాగుతుందని, మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో ప్రత్యేకంగా పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
మహిళలు తమ తమ వార్డుల్లో నిర్వహించే పంపిణీ కార్యక్రమాలకు హాజరై ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ప్రభుత్వ చర్యపై హర్షం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజు, వార్డు ఆఫీసర్ గోపి భాస్కర్, గుంటి సాయికృష్ణ, సి.ఎల్.ఆర్పీలు జ్యోతి, మంజుల, సరళ, రజితలతో పాటు మహిళా సంఘాల సభ్యులు మరియు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత వెల్దుర్తి పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ముగింపు ప్రధానోపాధ్యాయులు సాంబయ్య

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 25**

పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, వారి మానసిక--శారీరక వికాసానికి దోహదపడడం లక్ష్యంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి లో మే 11న ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ మే 25న విజయవంతంగా ముగిసింద అని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సాంబయ్య తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరం విద్యార్థులకు కేవలం వినోదాన్ని మాత్రమే కాకుండా, జీవితానికి ఉపయోగపడే ఎన్నో విలువైన పాఠాలను నేర్పించడం జరిగిందని.

సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ఎంత ఉత్సాహంగా వారిలోని ఉన్నత నౌపత్యాన్ని ప్రదర్శించారని ప్రతి రోజు కొత్త విషయాలను నేర్చుకుంటూ ఆనందంతో ఆటలు, కళలు, సంగీతం, యోగా, కరాటే, నృత్యం వంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని.

ఈ శిబిరం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి శిక్షకుడికి ప్రత్యేక అభినందనలు పత్రిక ముఖంగా తెలియజేస్తున్నామని ఆయన ఆనందం వ్యక్తం చేశారుడాన్స్ మాస్టర్ చింటూ విద్యార్థులకు నృత్యంలో లయ, క్రమశిక్షణ, భావ వ్యక్తీకరణను నేర్పి వారిలో కళాప్రతిభను వెలికి తీశారనికరాటే మాస్టర్ నైనిషాపిల్లలకు ఆత్మరక్షణతో పాటు ధైర్యం, నియమ నిష్టలను అలవాటు నేర్పించాలనియోగ ఉపాధ్యాయురాలు అనంత రెడ్డియోగా ద్వారా ఆరోగ్య పరిరక్షణ, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత యొక్క ప్రాముఖ్యతను వివరంగా తెలియజేశారనిమ్యూజిక్ తబలా మాస్టర్ జగ్గ చంద్ర గౌడ్ సంగీత స్వరాల ద్వారా విద్యార్థుల హృదయాల్లో ఆనందాన్ని నింపి కళాప్రేమను పెంపొందించడమే కాకుండా తాను స్థానికంగా వెల్దుర్తి లోనే ఉంటాను తబలా కల నేర్చుకుని విద్యార్థులు తమ వద్దకు వచ్చి నేర్చుకోవాలని ఉద్దేశం ఉంటే వారికి ప్రత్యేకంగా



సమయాన్ని కేటాయించి వారికి తగిన శిక్షణ ఇవ్వడానికి నేను ఎల్లవేళలా ఉంటాను అని ఆయన తెలియజేశారుఈ శిక్షకులందరూ విద్యార్థులను ప్రేమతో, సహనంతో శిక్షణ ఇచ్చి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చారు. వారి సేవలు నిజంగా అభినందనీయం.

ఈ సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థులు కేవలం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడమే కాకుండా, సమయపాలన, క్రమశిక్షణ, జట్టు భావన, పరస్పర గౌరవం వంటి మంచి విలువలను కూడా అలవరుచుకున్నారు.

ఇలాంటి శిబిరాలు గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయి. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయ బృందం, శిక్షకులు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు.వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూవిద్యార్థుల ప్రతిభను వికసింపజేసిన ఈ సమ్మర్ క్యాంప్ అందరికీ చిరస్మరణీయంగా నిలిచిపోతుంది.” అని తెలియ జేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో పాఠశాలప్రధానోపాధ్యాయులుసాంబయ్య ,ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, విజయ్ మోహన్ రాజ్, ఖదీర్ పాషా లు పాల్గొన్నారు వెల్దుర్తి పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన సాంబయ్య పదవి కాలనీత్యం విద్యార్థి విద్యార్థులను తన సొంత బిడ్డలుగా చూసుకుంటూ పాఠశాలై నా కుటుంబం అని భావనతో ఆయన మనస్ఫూర్తిగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులపై ఎంతో శ్రద్ధగా తన తోటి ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి మెలిసి ఉంటూ విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి అలసట లేకుండా ప్రతి పాఠ్య అంశాలు క్రీడలలో విద్యార్థులకు క్రమశిక్షణలో ఎంతో శ్రద్ధ వహిస్తూ వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని భావనతోనే తాను తమ ఉపాధ్యాయ సిబ్బందిని వలనే నేడు జిల్లాలోని వెల్దుర్తి పాఠశాల ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఆ గుర్తింపు నా ఒక్కడి వల్లనే కాదు నా యొక్క ఉపాధ్యాయ సిబ్బంది వల్లనని ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు రానున్న రోజుల్లో కూడా తాను వెల్దుర్తి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసినంత కాలం ఇలానే నా తోటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సహకరిస్తే మరింత వెల్దుర్తి పాఠశాలను జిల్లా స్థాయి కాదు రాష్ట్ర స్థాయిలో కూడా ముందుంచే ప్రయత్నాన్ని చేస్తానని వారు తెలియజేశారు వెల్దుర్తి పట్టణ రాజకీయ ప్రజానాయకులైన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో మరింత మన వెల్దుర్తిపాఠశాలకు పేరు ప్రఖ్యాతలు రావాలని ఆకాంక్షిస్తున్నానని వారు కొనియాడారు

## జమ్మికుంటలో రైతులకు 50% రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ ప్రారంభం --

# పచ్చిరొట్ట పంటతో భూసారానికి బలమైన మద్దతు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 25**

జమ్మికుంట మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట పంటకు ఉపయోగపడే జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న, జమ్మికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ సమక్షంలో రైతు సేవా కేంద్రం, జమ్మికుంటలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

జమ్మికుంట మండలంలోని తనుగుల పీఏసీఎస్, ధర్మారం పీఏసీఎస్, కోరపల్లి డీసీఎంఎస్, నాగంపేట డీసీఎంఎస్ కేంద్రాల్లో కూడా జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు.

ఈ పథకం కింద జీలుగ విత్తనాలను రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తున్నారు. పూర్తి ధర రూ.4,905 ఉన్న 30 కిలోల జీలుగ విత్తనాల బస్తాను రైతులకు రూ.2,452కే అందజేస్తున్నారు. ఒక 30 కిలోల బస్తా సుమారు రెండున్నర ఎకరాల భూమికి



సరిపోతుందని తెలిపారు.

రాయితీపై విత్తనాలు పొందాలనుకునే రైతులు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.

పచ్చిరొట్ట పంట వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు:

- భూమిలో సేంద్రియ కర్బన పదార్థాలు, సూక్ష్మజీవులు పెరిగి భూసారం మెరుగుపడుతుంది.
- గాలిలోని నత్రజనిని గ్రహించి నేలలో స్థిరపరచడం వల్ల యూరియా వినియోగం 25-30 శాతం వరకు తగ్గుతుంది.
- నేలలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది.
- కలుపు మొక్కల పెరుగుదల తగ్గుతుంది.
- పంట మార్పిడి ద్వారా చీడపీడల సమస్యలు తగ్గుతాయి.
- జీలుగ పంటను 40 రోజుల పాటు పెంచి పూతకు ముందే భూమిలో కలియదున్నితే 8 నుంచి 12 టన్నుల జీవపదార్థం నేలలో కలుస్తుంది.

దీంతో నేల నాణ్యత మెరుగుపడటంతో పాటు వానపాములు, సూక్ష్మజీవులకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని అధికారులు తెలిపారు. రైతులు రసాయనిక ఎరువులపై ఆధారపడకుండా పచ్చిరొట్ట సాగు ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## రామకోటి వ్రాసిన మెట్టుపల్లి ఉపాధ్యాయుడు

■ భద్రాద్రి రామయ్య కు సమర్పణ

**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు పోతుగంటి నాగరాజు, శ్రీరామ నామాన్ని జపిస్తూ ‘రామకోటి’ రాయడం పూర్తి చేశారు. ఈ రామకోటి ప్రతులను భద్రాచల పుణ్యక్షేత్రానికి తీసుకెళ్లి శ్రీరామభద్రుని పాదాల చెంత సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే ఎంతో దీక్షతో రామకోటి పూర్తి చేసిన నాగరాజును తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు అభినందిస్తున్నారు.



## మెట్టుపల్లి లో అక్రమ లేఔట్ లు

■ చర్యల కొరకు డిమాండ్



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లి పట్టణంలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూములను అక్రమ లేఅవుట్లుగా మార్చి విక్రయిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పలువురు వార్డు కౌన్సిలర్లు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. 26వ వార్డు కౌన్సిలర్ బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో 15, 16, 9వ వార్డుల కౌన్సిలర్లు ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. అక్రమ లేఅవుట్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

-ధాన్యమును తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్న రైస్ మిల్లర్ పై చర్యలు తీసుకోండి
-లారీలు సప్లై చేయని కాంట్రాక్టర్ పై చర్యలు ఏవి
-రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయరాజ్ కార్యదర్శి రమేష్ గౌడ్

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**

రైతు సంఘం ఆధ్వర్యంలో నాగపూర్ వడ్లకొనుగోలుకేంద్రాన్ని సందర్శించారు. అనంతరం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వడ్ల కొనుగోలు కేంద్రం లో ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ సంగీత కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జయరాజు, జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభమైన నాటి నుండి సరియైన లారీలు లేక రోజుల తరబడి వడ్లు తెచ్చుకొని కొనుగోలు కేంద్రాలలో రైతులు పడిగాపులుకాస్తు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు సక్రమంగా లారీలు సరఫరా చేయని లారీ కాంట్రాక్టర్స్ ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలో నెల రోజుల నుంచి వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ నేటి వరకు సగం వడ్లు సేకరించలేదని. ఇంకా రైతుల వడ్లు చాలా ఉన్నాయని. రాష్ట్ర మంత్రివర్యులు ఈ నెల చివరిలోపు మాత్రమే




వడ్లను కొంటామని ప్రకటించడం దారుణం అన్నారు. నెలరోజుల నుంచి కొనలేని దాన్యం కేవలం ఐదు రోజుల్లో ఎలాసాధ్యమవుతుందని, మంత్రి చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అన్ని బయట ఆరబెట్టి ఉండడంతో ఎండలోఎండిపోతున్నాయి. వర్షం వస్తే రైతులు వాటిని ఎక్కడ పెట్టాలని అన్నారు . కనుక తక్షణమే లారీలను సరఫరా చేసి రైతుల వద్ద వడ్ల కొనుగోలు చేయాలని, కొన్ని కేంద్రాలలో లేబర్ లేక లారీలు రాక గత నాలుగు రోజుల నుండి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, కొన్ని కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి తనిఖీ చేయకపోవడంతో ఐకెపివాళ్లఇష్టానుసారంగా వడ్లకొనుగోలు చేస్తున్నారని అన్నారు. తూకం లో మోసం చేస్తున్నారని అన్నారు.అడిగిన రైతుల పట్ల దురుసుగా వివరిస్తూ ఇబ్బందుల పాలు చేస్తున్నారని అన్నారు సంచులులేకఅత్యధిక రైతులు ఇబ్బందులు పడుతున్నారు ఈ యొక్క కేంద్రం కు మరిన్ని లారీలు సరఫరా చేసి రైతుల నుండి వడ్ల కొనుగోలు చేయాలని,



వర్షం వస్తే. రైతులకు తీవ్రనష్టంజరుగుతుందని తక్షణమే, అన్ని వడ్ల కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలనుసమకూర్చాలని,ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు చేసిన రైతులకు వెంటనే డబ్బులుచెల్లించాలని రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద మంచినీటి నీటి సౌకర్యం కల్పించి వర్షం వస్తే దాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని రాత్రి వేళల్లో వసతి సౌకర్యం కల్పించాలని ఆయన అన్నారు. రైస్ మిల్లర్లు ధాన్యం దించుకోవడంలో నిర్లక్ష్యం కారణంగా లారీలు అక్కడే నిలిచిపోవడంతో కొనుగోలు కేంద్రాలకు రెండు మూడు రోజులకు ఒకసారి వస్తున్నాయి. ఇలాంటి నిర్లక్ష్యం చేస్తున్న రైస్ మిల్లర్ పై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో. యాదవ్ గౌడ్, భూమా గౌడ్, బాలరాజ్, మానయ్య, మల్లేశం, ధనరాజ్, రాజు, లక్ష్మణ్, హరీష్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ధర్నా

■ బకాయిల చెల్లింపునకు డిమాండ్



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో, మెట్‌పల్లి డిపో ముందు విశ్రాంత ఉద్యోగులు ధర్నా సోమవారం నిర్వహించారు. ఆర్పీఎస్ 2017 బకాయిలు, ఇతర బకాయిలు చెల్లించాలని, 35-40 ఏళ్లుగా పనిచేసిన తమకు రిటైర్మెంట్ తర్వాత రావాల్సిన బకాయిలు ఇప్పటికీ అందలేదని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని సంఘం అధ్యక్షులు గట్ల రమేష్ పేర్కొన్నారు. రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆదేశాల మేరకు ఈ నిరసన తెలిపినట్లు తెలిపారు.

# డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు

గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, అందుకు తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల-2027 ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో పుష్కరాల ఏర్పాట్లపై రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులను అడిగి డిప్యూటీ సీఎం తెలుసుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో అధికారుల పనితీరుపై డిప్యూటీ సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడాది వ్యవధిలో రూ.8,600 కోట్లతో చేపట్టాల్సిన పనులకు ఇంకా డీపీఆర్‌లు ఎందుకు సిద్ధం కాలేదని ప్రశ్నించారు. ఒకే సంవత్సరంలో 7 వేల పనులను ఎలా పూర్తి చేస్తారని నిలదీశారు. ముఖ్యంగా పుష్కరాల నిర్వహణలో టూరిజం శాఖ నుంచి సరైన సన్నద్ధత ఎందుకు కనిపించడం లేదని మందలించారు. ఇష్టానుసారంగా ఖర్చు పెడదామని అనుకుంటే కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వదని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో పనులు చేయాలని దిశానిర్దేశర చేశారు. హడావిడిగా పాచిపోయిన సిమెంట్‌తో పనులు చేస్తే అవి కూలిపోతాయని హెచ్చరించారు. గత పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాట వంటి ఘటనలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. గోదావరి పుష్కరాలు అంటే కేవలం రాజమండ్రికే పరిమితం కాదని, 6 జిల్లాల్లోని 274 పంచాయతీల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో భక్తులకు సమాన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కరాల పనుల సన్నద్ధతపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చిస్తామని వెల్లడించారు. కేంద్ర నిధుల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు వెళ్లే సమయంలో అన్నివిధాలుగా సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. గోదావరి నదిలో భక్తులు మురికినీళ్లలో స్నానం చేయడం సరికాదని పేర్కొన్నారు. గోదావరి కాలుష్య నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. అలాగే, తూర్పుగోదావరి జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో గోదావరి నది కాలుష్యానికి కారణాలపై ఆరా తీశారు. క్లీన్ కృష్ణా, గోదావరి మిషన్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## మహారాష్ట్రలో లోయలోకి దూసుకెళ్లిన స్కార్పియో

మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. రాయగఢ్‌లోని అంబెనాలి ఘాట్ సమీపంలో నదీ లోయలోకి స్కార్పియో వాహనం దూసుకెళ్లిన ఘటనలో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను వెలికితీసేందుకు సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, మిగిలిన వారికోసం గాలిస్తున్నారు. మహాబలేశ్వర్, పొలాద్‌పూర్ మధ్య ఉన్న అంబెనాలి ఘాట్ వద్ద ఈ ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో వాహనంలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది ప్రయాణికులు మృతిచెందినట్లు సమాచారం.